క్లుప్తంగా

లేమర్తి హైస్కూల్‌కు 60 బెంచీలు


కొత్త బెంచీలపై విద్యార్థులతో కలసి కూర్చున్న కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి

అగనంపూడి: నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ లేమర్తి హైస్కూల్‌కు సరఫరా చేసిన 60 బెంచీలను కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రారంభించారు. సుమారు రూ.7లక్షల వ్యయంతో వీటిని అందించారు. ఆమె మాట్లాడుతూ నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునే పరిస్థితిని కల్పించారన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగ పరచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమ్మాజీ, జేసీఎస్ కన్వీనర్ ఇల్లపు ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డివైడర్ పైకి కారు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో అదుపు తప్పిన ఓ కారు డివైడర్ ఎక్కింది. అదృష్టవశాత్తు ఈ సంఘటనలో ఎటువంటి నష్టం జరగలేదు. ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–9లో ఒక మహిళ స్కోడా కారు నడుపుతున్నారు. గురజాడ కళాక్షేత్రం ఎదురుగా ఉన్న రోడ్డులోకి వచ్చేసరికి బ్రేకుపై కాలు వేయాల్సి ఉండగా పొరపాటున ఎక్స్‌లేటర్‌పై వేశారు. దీంతో కారు అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కింది. అయితే ఈ సంఘటనలో కారుకు గాని, డ్రైవ్ చేస్తున్న వారికి గాని ఎటువంటి నష్టం జరగలేదు.

గోదాదేవికి తిరునక్షత్ర పూజలు


గోదాదేవికి పూజలు చేస్తున్న అర్చకులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం గోదాదేవి తిరునక్షత్ర పూజలు చేశారు. పూజల్లో భాగంగా గోదాదేవికి అర్చన, మంగళాశాసనం, తిరునక్షత్ర తనియన్లు చేశారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు జిప్సా సర్వసభ్య సమావేశం

గాజువాక: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేటు పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా) సర్వసభ్య సమావేశం ఈ నెల 23న నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు తెలిపారు. స్థానిక యశోద పాఠశాలలో ఉదయం తొమ్మిది గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు.

29న గర్భిణులకు యోగా శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం, కృష్ణా హెల్త్ సెంటర్ సంయుక్తంగా ఈ నెల 29న గర్భిణులకు ప్రత్యేకంగా యోగా వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు తెలిపారు. వర్క్‌షాపులో భాగంగా కృష్ణా హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ వి.రఘురామ కృష్ణంరాజు పాల్గొని సూచనలిస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని.. రిజిస్ట్రేషన్ కోసం 91008 55823కు ఫోన్ చేయాలన్నారు.

వ్యర్థాలకు అందమైన చిరునామా

కళాత్మక దృష్టి ఉంటే సృష్టిలో ప్రతీ వస్తువు విలువైనదే. చక్కగా తీర్చిదిద్దే నేర్పు, నైపుణ్యం ఉంటే పనికి రాని వస్తువైనా అందమైన కళాకృతిగా దర్శనమిస్తుంది. అలా వ్యర్థాలకు అర్థం కల్పిస్తూ వెలిసిన కేంద్రమే ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్. ఆ అద్భుతాన్ని నేరుగా చూడాలంటే చినగంట్యాడలోని పాత ఈసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని చూడాల్సిందే. నిన్నటి వరకు పాడుబడినట్లుగా కనిపించే ఈ భవనం నేడు అందమైన కళాకృతులకు చిరునామాగా మారి స్వాగతిస్తోంది.

- పనికిరాని వస్తువులతో చక్కని కళాకృతులు
- ఆకర్షణీయంగా 'ఆర్‌ఆర్‌ఆర్' సెంటర్


పాతటైర్లలో వేసిన మొక్కలు


చినగంట్యాడ ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో పనికిరాని డ్రమ్ములతో తయారు చేసిన కుర్చీలు

గాజువాక: మనకు పనికిరాని వస్తువులను బయట పడేస్తాం. చెత్త కుప్పల్లోకి విసిరేస్తాం. ఇంట్లో అడ్డు లేకుండా చూసుకుంటాం. ఇప్పటివరకు ఇదే జరిగింది. ఇప్పుడు లెక్క మారింది. పనికిరాని వస్తువులను బయటకు విసిరేయాల్సిన అవసరం లేదు. వాటితో వీధులను చెత్తతో నింపేయాల్సిన అవసరం అంతకన్నా లేదు. వాటిని తీసుకెళ్లి చినగంట్యాడలోని పాత ఈ సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్‌లో ఇస్తే చాలు. అందులోని సిబ్బంది వాటిని అందమైన కళాకృతులుగా మార్చేస్తారు. అందరికీ ఉపయోగపడే విధంగా అందుబాటులోకి తెస్తారు.

డ్రమ్ములతో కుర్చీలు

పనికిరాని డ్రమ్ములతో కుర్చీలను తయారు చేసి అందరూ కూర్చునే విధంగా అందుబాటులోకి తెచ్చారు. పాత టైర్ల ముక్కలు, చెక్కలతో బల్లలను తయారు చేశారు. మరికొన్ని పాతటైర్లను ఉపయోగించి పూల కుండీలను తయారు చేశారు. అందులో మొక్కలను కూడా నాటారు. నగంట్యాడలోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో పనికిరాని వస్త్రాలను ఉపయోగించి గుడ్డ సంచులను తయారు చేస్తున్నారు. దీనికోసం ప్రస్తుతం ఎనిమిది కుట్టు మిషన్లు ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో లభించే పాత దుప్పట్లు, చీరలు, ఇతర వస్త్రాలను ఇక్కడికి తీసుకొచ్చి గుడ్డ సంచులను తయారు చేస్తారు. పొదుపు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా ఈ సంచులను కుట్టే బాధ్యత వారికి అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సంచులను ప్రాచుర్యంలోకి తీసుకురావడం ద్వారా ప్లాస్టిక్ సంచుల వినియోగం తగ్గించాలన్న ఉద్దేశంతో జీవీఎంసీ ఈ సెంటర్లను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. త్వరలోనే ఈ సెంటర్ ప్రారంభం కానుంది.

చదవని పుస్తకాలుంటే ఇవ్వండి..

నగరవాసులు తమ ఇళ్లలో చదవకుండా పక్కన పెట్టేసిన పుస్తకాలను కూడా ఈ సెంటర్‌లో ఇవ్వొచ్చు. ఇలా వచ్చిన పుస్తకాలతో ఒక లైబ్రరీని అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు. కార్డ్ బోర్డులు, థర్మాకోల్ షీట్‌లను ఇస్తే వాటితో ఫొటో ఫ్రేమ్‌లను తయారు చేయనున్నారు.


పాతటైర్లు, డ్రమ్ములతో కళాకృతులు

ఇది చెత్త కేంద్రం కాదు

ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రం చెత్త నిల్వ చేసే పాయింట్ కాదు. నివాసులకు పనికిరాని వస్తువులను సేకరించి వివిధ వస్తువులు, కళాకృతులను తయారు చేసే కేంద్రాలు. భవిష్యత్‌లో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల ద్వారా ప్రజలకు ఉపయోగపడే అనేక ఉత్పత్తులు తయారవుతాయి. చినగంట్యాడలోని ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రంలో ఒక కాఫీ షాప్‌ను కూడా పెట్టే ప్రణాళికలో ఉన్నాం. ఈ కేంద్రాలపై ఎవరికీ అపోహలు అవసరం లేదు.
– డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, గాజువాక సహాయ ప్రజారోగ్యాధికారి

సేవకు మారుపేరు

వాలంటీర్లకు వందనం

పెదగంట్యాడ: రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ సేవకు మారుపేరుగా, దేశంలోనే ఆదర్శంగా నిలిచింది. కరోనా విపత్తు వేళ వలంటీర్ వ్యవస్థే లేకుంటే ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయేవని ప్రతీ ఒక్కరు చెబుతున్న మాట. ఏ ఒక్కరూ ఇంటి నుంచి బయటికి రాలేని పరిస్థితుల్లో మందులు, పౌష్టికాహారం అందించి ఎంతోమంది ప్రాణాలు నిలిపారు. తమ పరిధిలోని ప్రజలకు ఏయే పథకాలు వర్తిస్తాయో గుర్తించి, సమాచారం అందజేస్తున్నారు. వారితో దరఖాస్తు చేయించి, పథకాలు అందేందుకు సహకరిస్తున్నారు. బీమా పథకంలో అర్హులను చేర్పించి, వారి కుటుంబాల్లో భద్రత నింపే బాధ్యతను తీసుకుంటున్నారు. ధ్రువపత్రాలను ఇంటికే అందిస్తున్నారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయించడం, ఆధార్ కార్డులో మార్పులు చేయించడం, ఇళ్లు లేని పేదలను గుర్తించి వారికి ఇళ్ల స్థలం లేదా పక్కా గృహాలకు స్వయంగా దరఖాస్తు చేయించి లబ్ధి పొందేలా చేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛనుదారుల ఇళ్లకు, అవసరమైతే పొరుగూళ్లకు, ఆసుపత్రికి వెళ్లి పింఛను సొమ్మును అందిస్తున్నారు. వారి సేవలు ఎనలేనివని లబ్ధిదారులు కొనియాడుతున్నారు.

కోడి కూయకముందే పింఛన్



నాకు జగనన్న ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పెన్షన్ వస్తుంది. ప్రతి నెలా కోడి కూయకముందే మా వలంటీర్ పిట్టా వెంకటలక్ష్మి ఇంటికి తెచ్చి పెన్షన్ డబ్బులు ఇస్తుంది. ఒకసారి ఆరోగ్య పరిస్థితి విషమించి నేను కేజీహెచ్ లో చేరాను. చేతిలో చిల్లి గవ్వ లేదు. అలాంటి సమయంలో మా వలంటీర్ వెంకటలక్ష్మి ఆసుపత్రికి వచ్చి నాకు పెన్షన్ డబ్బులు అందజేసింది. ఆమెకు రుణపడి ఉంటాం.
–పరమటి నూకాలమ్మ, కేఎస్ పాలెం

సహకారం మరువలేను



నా భర్త మృతి చెందిన తర్వాత నన్ను ఆదుకునే వారు కరువయ్యారు.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్ పితాని పైడి రాజు మా ఇంటికి వచ్చి నాతో వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేయించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్‌ను ప్రతీ నెల ఒకటో తేదీన తెచ్చి ఇస్తున్నారు. వారి సహకారం మరువలేను.
–పొట్నూరు సరస్వతి, యాతపాలెం

ఒంటరిగా ఉన్న నాకు అండగా..



నాకు వయసు మీద పడింది. ఒక్కదాన్నే ఉంటాను. మా వలంటీర్ లలిత మా ఇంటికి వచ్చి నాతో ఒంటరి మహిళ పింఛన్ కోసం దరఖాస్తు చేయించింది. ప్రతీ నెల ఒకటో తేదీన ఉదయం ఇంటికి వచ్చి పెన్షన్ ఇస్తుంది. ఆమెకు ధన్యవాదాలు
– టి. చినతల్లి అశోక్ నగర్

పోలీస్ కమిషనర్ పర్యటన

ట్రాఫిక్ సమస్యపై పలు ప్రాంతాల్లో పరిశీలన


విశాఖ డెయిరీ వద్ద పోర్టు అధికారులతో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

అక్కిరెడ్డిపాలెం: ట్రాఫిక్ సమస్యలపై నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ శనివారం గాజువాక నియోజకవర్గంలో పర్యటించారు. పలు విభాగాల అధికారులతో కలిసి షీలానగర్ నుంచి అగనంపూడి వరకు పరిశీలించారు. షీలానగర్ సిగ్నల్ పాయింట్, విశాఖ డెయిరీ, పాతగాజువాక జంక్షన్ వద్ద ఆగి, ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించారు. సీపీ వెంట ఉన్న ట్రాఫిక్ పోలీస్ అధికారులు, విశాఖ పోర్టు, గంగవరం పోర్టు అధికారులు, లారీ ఓనర్స్ అసోసియేషన్, ట్యాంకర్స్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ట్రాఫిక్ సమస్యలపై ఆయనకు వివరించారు. అగనంపూడి నుంచి షీలానగర్ వరకు సర్వీసు రోడ్డు విస్తరణ, రోడ్లపై విస్తరించిన స్టాళ్లు, వ్యాపార సంస్థల తొలగింపు తదితర అంశాలపై ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సీపీ చర్చించారు. గంగవరం పోర్టు నుంచి విశాఖ పోర్టుకు నిత్యం భారీ, అతిభారీ వాహనాలు రాకపోకల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు, మల్కాపురం ప్రాంతంలో ఉన్న ఆయిల్ ట్యాంకర్ లారీలు రాకపోకల సమయంలో కలిగే ఇబ్బందులు, ప్రమాదాలు జరుగుతున్న పరిస్థితులను ఆయా అసోసియేషన్లు సీపీ దృష్టికి తీసుకువచ్చాయి. రోడ్ల విస్తరణ, సిగ్నల్ పాయింట్ల అభివృద్ధి తదితర చర్యల నేపథ్యంలో సీపీ పర్యటించినట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ట్రాఫిక్ డీసీపీ ఆనందరెడ్డి, ఏడీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ రాజీవ్ కుమార్, సౌత్ ఏసీపీ త్రినాథ్, అడిషనల్ ట్రాఫిక్ ఎస్పీ, నేషనల్ హైవే అథారిటీ పీడీ, గాజువాక సీఐ లంకా భాస్కరరావు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ రెడ్డి, శ్రావణ్ షిప్పింగ్ అధినేత సాంబశివరావు, విశాఖ పోర్టు ట్రస్ట్ పలు విభాగాల అధికారులు, కంచరపాలెం, మల్కాపురం ట్రాఫిక్ సీఐలు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

68వ వార్డులో ఓపెన్ జిమ్ ఏర్పాటు


హైస్కూల్ పక్కన ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్

అక్కిరెడ్డిపాలెం: వ్యాయామ ప్రియులకు త్వరలో ఓపెన్ జిమ్ అందుబాటులోకి రానుంది. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల పక్కన శనివారం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. సుమారు రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను త్వరలో ప్రారంభించి వినియోగంలోకి తీసుకురానున్నట్లు వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ అంశంలో కేంద్రంపై ఒత్తిడి తెస్తాం

- కాంగ్రెస్ నాయకుల వెల్లడి
- ఉక్కు దీక్షలకు మద్దతు


ఉక్కు దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 891వ రోజు శనివారం ఆలిండియా కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, నాయకులు మాట్లాడుతూ మోదీ పాలనలో ప్రభుత్వరంగం కుదేలైందన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం అనేక మంది రైతులు తమ భూములను త్యాగం చేస్తే, నేడు ప్లాంట్‌కు చెందిన భూమిని రియల్ ఎస్టేట్‌గా మార్చేందుకు ప్రభుత్వం చూస్తోందన్నారు. వచ్చే నెలలో రాహుల్ గాంధీ రాష్ట్రానికి వచ్చి స్టీల్‌ప్లాంట్ కార్మికుల దీక్షకు సంఘీభావం తెలుపుతారన్నారు. ఉక్కు ఉద్యమం 900 రోజులకు చేరువవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పాదయాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాకేష్‌రెడ్డి, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవింద్, రాష్ట్ర వర్కింగ్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, ఏఐసీసీ మెంబర్ వేగి వెంకటేష్, మంత్రి రాజశేఖర్, పులి రమణారెడ్డి, డి.ఆదినారాయణ, జెర్రిపోతుల ముత్యాలు, కె.పరంధామయ్య, ఇతర కాంగ్రెస్ నాయకులు, ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ లీడర్లు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు.

వాసవి ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘం సభ్యులు

పెదగంట్యాడ: శ్రీవాసవి ఆర్యవైశ్య సంఘం పెదనడుపూరు నూతన కార్యవర్గ సభ్యులు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో అధ్యక్షునిగా బొడ్డు కృష్ణారావు, కార్యదర్శిగా కులుకూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా వంకతాడ నర్సింహమూర్తి, కార్యవర్గ సభ్యులుగా 25 మంది ఎన్నికయ్యారు. వారు 76వ వార్డు నడుపూరులోని ఉక్కు కళావేదికలో శనివారం రాత్రి ప్రమాణం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ కొత్త కమిటీ సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం స్టీల్‌ప్లాంట్‌లో పని చేసి, ఉద్యోగ విరమణ చేసిన బచ్చు సోమరాజు, పద్మ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, కులుకూరి మంగరాజు, ఏవీఎస్ఎన్ గుప్తా, కేసారపు శ్రీను రమేష్, మహేష్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి పుష్పాభిషేకం


స్వామికి పుష్పాభిషేకం నిర్వహించిన దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవ, గోత్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం పుష్పాభిషేకం, నక్షత్ర హారతి, ఏకాంత సేవలు జరిపించారు. ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో జి.వి.కృష్ణయ్య, జీవన్ బాబు, దివ్యక్షేత్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన


డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న జెడ్సీ సింహాచలం, కార్పొరేటర్ సుజాత

పెదగంట్యాడ: వర్షాలు పడుతున్న నేపథ్యంలో డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలని జోనల్ కమిషనర్ సింహాచలం, 73వ కార్పొరేటర్ భూపతిరాజు సుజాత సూచించారు. డెంగ్యూ నివారణపై వార్డు పరిధి కర్ణవానిపాలెంలో శనివారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా, బోదకాలు వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. బావుల్లో గాంబూసియా చేపలను విడిచిపెట్టారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

నిశితంగా ఓటర్ల పరిశీలన


అగనంపూడి, ఫార్మాసిటీ కాలనీల్లో ఓటర్ల వివరాలు పరిశీలిస్తున్న ఈఆర్‌వో లక్ష్మారెడ్డి

అగనంపూడి: గాజువాక నియోజకవర్గ పరిధిలో 8 మంది ఏఈఆర్‌వోలు, 31 మంది సూపర్‌వైజర్లు, 305 మంది బీఎల్‌వోల ఆధ్వర్యంలో ప్రతీ ఇంట్లో ఓటర్ల పరిశీలన జరుగుతుందని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్ డి.లక్ష్మారెడ్డి తెలిపారు. గాజువాక మండల పరిధిలోని ఫార్మాసిటీ కాలనీలు, అగనంపూడి ప్రాంతంలో శనివారం ఆయన బీఎల్‌వోలతో కలిసి పర్యటించి, వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకే ఇంట్లో పదిమంది కంటే ఎక్కువగా ఓటర్లు ఉంటే వారి వివరాలు సేకరించి, పరిశీలించాలన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో వలసలు ఉంటాయన్నారు. అద్దె ఇంట్లో ఉండేవారు ఇల్లు మారిన అనంతరం అదే ఇంటి చిరునామాలో ఓటు హక్కు ఉండిపోతుందన్నారు. మళ్లీ కొత్తగా చేరిన ఇంట్లో ఓటరుగా నమోదు చేసుకుంటూ ఉండడం వల్ల ప్రతీ ఇంట్లో కుటుంబ సభ్యుల కంటే ఓటర్ల సంఖ్య అధికంగా ఉంటోందని, అటువంటి వారిని తొలగించి ప్రస్తుతం అద్దెకు ఉంటున్న ఇంట్లో ఓటరుగా నమోదు చేయాలని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. ప్రతీ రాజకీయ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని సూచించారు. కార్యక్రమంలో గాజువాక, పెదగంట్యాడ మండల తహసీల్దార్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: 76వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలు, సచివాలయ సిబ్బంది శనివారం ఇంటింటా ఓటర్ల సర్వే చేపట్టారు. నడుపూరు, హౌసింగ్ బోర్డు కాలనీ, చిన నడుపూరు, బర్మా కాలనీ, సీతానగరం, నెల్లిముక్కు తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలపై ఆరా తీశారు. ఓటర్ల వివరాలు, వారి గుర్తింపు కార్డులను సరి చూసుకున్నారు. పేర్లు, డోర్ నెంబర్ల తప్పులను సరిదిద్దుతున్నారు. స్థానికంగా ఉంటూ ఇతర ప్రాంతాల కు వలస వెళ్లిన వారితో ఫోన్‌లో మాట్లాడారు. వీఆర్వో సీతారామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఎల్‌వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ జీవీఎల్‌కు పోర్టు కార్మికుల వినతి


ఎంపీ జీవీఎల్ కు వినతిపత్రం అందజేస్తున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికులు తమ ప్రధాన సమస్యలపై బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలపై జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, పేర్ల అప్పారావు, కిలాని ముసలయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

28న బీజేపీ నియోజకవర్గస్థాయి సమావేశం

గాజువాక: బీజేపీ గాజువాక నియోజకవర్గస్థాయి సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సహా రాష్ట్ర నాయకులందరూ పాల్గొంటారని తెలిపారు. పాతకర్ణవానిపాలెంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విస్తృత కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పురందేశ్వరి బాధ్యతలు స్వీకరించిన తరువాత విశాఖకు ఈ నెల 27న రోడ్డుమార్గంలో వస్తున్నారని, అగనంపూడి టోల్‌గేటు వద్ద ఆమెకు ఘనస్వాగతం పలకాలని కోరారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు మేడపాటి రవీంద్ర, పుట్ట గంగయ్య, సుహాసిని ఆనంద్, దీనంకొండ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రిటైర్డ్ అధికారులకు మెడికల్ స్కీమ్‌పై ఆప్షన్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పదవీ విరమణ అధికారుల మెడికల్ స్కీమ్‌పై యాజమాన్యం ఆప్షన్ ఇచ్చింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్ నుంచి 2017 తర్వాత పదవీ విరమణ చేసిన అధికారులకు మొదట్లో గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ స్కీమ్ ఉండేది. ఆ స్కీమ్‌లో మార్పులు చేస్తూ పోస్టు రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ (పీఆర్‌ఎంఎస్) పేరిట ఉక్కు యాజమాన్యం కొత్త స్కీమ్ ప్రవేశపెట్టింది. కొత్త స్కీమ్ పదవీ విరమణ అధికారులకు నష్టదాయకమని, పాత విధానాన్ని కొనసాగించాలని వారు యాజమాన్యాన్ని అభ్యర్థించారు. యాజమాన్యం నుంచి స్పందన రాకపోవడంతో విశ్రాంత అధికారుల సంఘం హైకోర్టును ఆశ్రయించింది. స్కీమ్ ఎంపికపై ఆప్షన్ ఇవ్వాలంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో యాజమాన్యం ఆప్షన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులపై ఉక్కు విశ్రాంత అధికారుల సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు హర్షం ప్రకటించారు.

గోతిలో ఇరుక్కున్న బస్సు.. ట్రాఫిక్‌కు అంతరాయం


నిలిచిపోయిన వాహనాలు

అక్కిరెడ్డిపాలెం: శనివారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షం కారణంగా గాజువాకలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. షీలానగర్ ప్రాంతంలోని ఓ రోడ్డుపై భారీగా నీరు నిలిచిపోవడంతో పాటు ఆ ప్రాంతంలో లోతైన గోతిలో ఒక ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు ఇరుక్కుపోయింది. ఆ సమయంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అనంతరం బస్సును కాస్త పక్కకు తొలగించడంతో రాకపోకలకు మార్గం సుగమమైంది.